"సూరి గాడేంటింకా నెగనేదూ?
బారెడు బొద్దెక్కిపోనాదీ! బేగి నేపేసి ఇస్కూలు బడికి తోలియ్యే!" పారమ్మని కేకేసి, పన్లోకెల్లాడు నరసింగు.
పారమ్మ పనులన్నీ తెములుచ్చుకుని వచ్చి చూస్తే సూరీడింకా నిద్రలోనే ఉన్నాడు.
" ఓలమ్మ నానేటి సేదునూ, ఈడింకా నెగిసిపోనాడే అనుకున్నాను.
ఓరే, అయ్యా! సూరిగా, నెగురా! నీతొటోల్లంతా బల్లోకెల్లనానికి తెవిలి పోనారూ!" అంది పారమ్మ.
మొదటి తండ్రి కేకేసినపుడే సూరీడుకి తెలివొచ్చేసింది.
కానైతే-
వాడికి బళ్ళోకెల్లాలని లేదు.
ఒళ్ళంతా సలపరంగా ఉంది. దుప్పటి తలనిండా లాక్కుని ముసుగు తన్ని పడుకున్నాడు.
ముడుమలు గెడ్డం కిందికి దన్ను పెట్టుకుని, పాదాలు చేతులతో పట్టుకుని
కాళ్ళూ చేతులూ కట్టి పడేసినట్టు ముటక దన్ని పడుకున్నాడు.

# అమ్మా, ఆ బడికి నేనెల్లనే?

పి.వి.బి. శ్రీరామమూర్తి

తండ్రెళ్ళిపోయేసరికి సూరీడుకి కొండంత ధైర్యం వచ్చేసింది

ఎందుకంటే-

'స్కూలుకెళ్ళనని మారం చేస్తే తల్లి బతిమాలుతుంది. 'బడికెల్లిపోరా నాయినా!' అని సూరీడు రెండుసార్లు కాళ్ళూ చేతులు తన్నుకుని క్రిందపడి ఏడిస్తే- ఈ పూటకొగ్గియే అంటే 'అయితేరేపెల్లిపోరా! అయ్యికి తెలిత్తే సావసంపి సెవులు మూత్తాడు' అని విడిచిపెడుతుంది.

అప్పుడు సూరీడు తుర్రున వీధిలోనికి పారిపోతాడు ఆడుకోవటానికి.

'తండ్రి పిచ్చిగానీ, ఆ బడికెందుకెల్లడమో?' అనుకుంటాడు.

మొదట్లో బళ్ళో జాయినయినపుడు 'సర్దా'గానే వెళ్ళాడు.

కారణం తండ్రి కొత్త బట్టలు కుట్టించాడు. ఇస్కూలు బేగ్‌కొన్నాడు. కొత్తపలక కొన్నాడు. తెల్ల పలక పుల్లలు పెట్టెతోకొన్నాడు. ఆ పలక పుల్లల కోసం నారయ్య కొడుకు 'రామిగాడు', సాకలి బుట్టోడి కొడుకు ఈరిగాడూ, సావుకారి గోవిందం కూతురు రత్నాలూ తనసుట్టూ తిరిగేవోరు. ఎంత ఇబ్బింత్రంగా ఉండేదో ఆ కవుర్లన్నీ తల్లికి సెప్పి, మురిసిపోడం, తల్లి పూరీణ్ణి జమీందారు కొడుకు నాగా సూడ్డం' సూరిగానికెంతో ఆనందాన్నిచ్చేది.

కానీ-

ఆ పలకపుల్లల పాకెట్టయిపోవటం, పలకపుల్లలు కొనుక్కుంటానంటే 'మొన్ననే డబ్బీడు పుల్లలు కొనిచ్చినాను. అప్పుడే అయిపోయినాయా?' అని తండ్రి గసర్డంతో సూరీడు చిన్నబుచ్చుకున్నాడు.

ఇస్కూలు బడి కొచ్చినపుడందరికాడా డబ్బులుంటాయి. ఇంట్రబిల్లు ఇవ్వగానే స్వీట్ల జంగిడ మీద ఈగల్లా పిల్లలందరూ అయిసుబండీసుట్టూ మూగుతారు. అయిసులు కొనుక్కుంటారు కొందరు సక్కిలాలూ కొందరు జాంకాయిలూ కొనుక్కుంటారు. తనకయితే జోబీలో సిల్లుగవ్వ ఉండదు' సూరీడు బాధపడతాడు.

వాడి మనసులో ఇంకా ఎన్నో బాధలు వాడికింకా ఎన్నో భయాలు.


అవి-

'పెతి సంవత్సరం అందరూ ఇస్కూలు యూనిఫారం కుట్టించుకుంటారు. సూరీడికి బళ్ళో జాయినయినపుడు తండ్రి బట్టలు కుట్టించాడు. ఆ తరవాతీ మళ్ళా కుట్టించనే లేదు. తల్లి అంట్లుతోమే ఇంట్లో ఎవరోవాళ్ళ పిల్లల పాతబట్టలిస్తే అవి తెచ్చింది. వాట్నేసుకుని బడికెల్తే - అందరూ బుడబుక్కలోడని ఎగతాళి చేస్తారు. ఇంకోసారి ఇంకెవర్నో అడిగి తెచ్చిన బట్టలు తెచ్చింది. ఆ బట్టలయితే బగున్నాయి గానీ- ఆ నిక్కరు మధ్యలో చిరిగిపోవటం సూరిగాడు చూళ్ళేదు. కింద కూచోగానే టీచరమ్మ కిసుక్కున నవ్వింది. పిల్లలందరూ

## సాధారణ ప్రచురణ (రూ. 1,000)కు ఎంపికయిన కథ

గొల్లున నవ్వారు. సూరీనికేడుపొచ్చి మధ్యాహ్నం స్కూలు కెళ్ళనని మొరాయించాడు. పారమ్మ జంగపు మల్లీను కాడకెల్లి నిక్కరు కుట్టించి తెచ్చింది.

''మా బుజ్జి కన్నే! బంగారం గాదూ! బాగా సదుంకోని పెద్దుజ్జోగం సెయ్యాల! పెసిరెంటుగోరి



అబ్బాయినాగా ఇమానమెక్కి అమెరికా ఎల్లాల! అయ్యా, అపుడు మమ్మల్ని తీసికెల్తావా?'' అని వాడిగడ్డాన్నెత్తి బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

''నానెల్లను. ఇక్కడోటే మీకాడే ఉంతాను''

''ఉరే అయ్యా! ఇక్కడేటుందిరా? గడ్డీ గాదరానూ?''

''మరైతే ఆ యమెరికాలో గడ్డే ఉండదా? మరక్కడావువేటి తింతాయి? మరక్కడ పాలుండప్పోతే టియ్యాలెలా తాగుతారు?''

'' ఊరే, ఎదవ పెసిన్లెయ్యికు'' తండ్రి కసురుకున్నాడు.

అప్పుడు సూరీడు తల్లినడిగాడు. ''ఓలమ్మా! అమెరికాలో రామ్మందిరముంటాదా? అక్కడ గోలీకాయలాడుకోవచ్చా? మన్నాగే ఆ యూర్లోనీ సెరవు లోనీ ఈతలు కొట్టుకోచ్చా? గోర్జీలున్నాయా? బాలమ్మా! ఇంతకీ అమెరికా యంటే ఎక్కడోటున్నారే?'' అనడిగాడు.

''అవునో, ఏవయ్యా, అమెరికావంటే మన జిల్లాలోనే ఉందా? బెజవోడవతలుందా?'' అనడిగింది యజమానిని (భర్తని)

నరిసింగు నీళ్ళు నమిలాడు.

''అదీ మనజిల్లాలో నేదుగానీ బొంబాయి, ఢిల్లీనాగే అదీ మనదేశంనోనే ఉంటాదనుకుంతా. అయినా సదుకోగానికెల్లురా, అంతే ఈ సొప్ప దంటు పెసిన్లేట్రా..నువ్వింతకాన్ననే. ఆత్లో ముద్దు సేసి, ముద్దుసేసి సున్నప్పెడతనాగా సేత్తన్నావు'' అని కసురుకున్నాడు.

ఆరోజు ఆలస్యం వెళ్ళినందుకు రోజంతా వాణ్ణి ఆ టీచరమ్మ మోకాలు మీద నిల్పోబెట్టింది. వాడి ముణుకులు సలుపులు పెట్టాయి ఏడుపొచ్చింది. కూర్చుండిపోయాడు.

టీచరమ్మ వాణ్ణి రెండు చెంపలూ వాయించింది. వాడు ఏడుపులంకించుకున్నాడు. ''ఎందుకురా, ఏడుపు? దిద్దు, అక్షరాలు రాసిచూపెట్టు'' అని దెబ్బలాడినా సూరీడు చెయ్యికదపలేదు. టీచరమ్మ సూరీడి చేతి లో పలకలాక్కుని పలకతో నెత్తిమీద, మండలమీదా కొట్టింది. సూరీడుకి పట్టరాని కోపం వచ్చింది. మెల్లగా తిట్టాడు. ఆ పక్కనే ఉన్న కుర్రాడు ఆ తిట్లు విని, టీచరమ్మకి విషయం చెప్పాడు. దాంతో టీచరమ్మ అపరకాళికే అయింది. జుట్టుపట్టుకొని గోడకేసి కొట్టింది. ఆ సమయంలో ఆనందరావు మేస్టారొచ్చి అడ్డుకోకపోతే, ఆమె ఏం చేసేదో ఆమెకే తెలీదు.

''వాడు చిన్నవాడండీ! వాడికేం తెలుస్తుంది? అది బూతుమాటని. వాడికసలు తెలీదు. వాళ్ళింట్లో అది మామూలు పదం. అందుకే అనేసాడు'' అని సూరీడు దగ్గర కొచ్చి '' ఒరే సూరీ, తప్పయిపోయిందని, అమ్మగారికి చెప్పు. 'సెమించమ'ని చెప్పు'' అన్నాడు.



సూరీడు నమస్కారం పెట్టలేదు.

మొండిగా నిలబడ్డాడు. పిల్లలందరూ వాడికి నచ్చచెప్పారు. 'సెమాపణ' చెప్పమని సలహా ఇచ్చారు.ఎప్పిట్లు చెయ్యమన్నారు. ఏం చేసాడో, ఎలా చేసాడో తెలీదుగానీ- టీచరమ్మ వెనక్కి తగ్గింది.

ఈ విషయం పారమ్మకి తెలిసి ఒంటెకాలి మీద లేచింది ' ఇస్కూలు' బడికెల్లి టీచరమ్మ అంతు చూస్తానంది టీచరమ్మకి చాకిరేవు పెట్టిస్తానంది.

''ఒలే పెదోల్లకోపం పెదివికిసేటే! ముల్లరిటాకు మీద పడ్డా అరిటాకు ముల్లు మీద పడ్డా సెడిపోయేది 'అరిటాకేనే'! మనం కయ్యానికెల్తే నట్టపోయేది మనమేనే. నువ్వు తొందరపడకే...నానెల్తానూ!'' అన్నాడు.

సూరీడు సంతోషం చల్లారిపోయింది పొంగే పాలమీద నీళ్లుపోసినట్టు. అయిపోయింది. ' ఈ దెబ్బతో తల్లి ఆళ్లమీద కయ్యానికెల్తాది. ఆల్లు ఇస్కూలుకి మ(్రా)నివ్వరు. సుబ్బరంగా 'బిల్లాకర్రా' ఆడుకోవచ్చనుకున్నాడు.

నరిసింగు బడికెళ్లి టీచరమ్మ పాదాలుపట్టుకుని 'సిన్నగుంటడు సెమించండి' అన్నాడు.

వాళ్ళు క్షమించేసారు.

అప్పటి వరకూ సూరీడు స్కూలు కెళ్తే బియ్యమిచ్చేవాళ్ళు. 'పుణ్యం పురుషార్థం' రెండూ తీరినట్లు – వాడి చదువూ, ఇంటికి బియ్యమూ ఖర్చు లేకుండా జరిగిపోయేపనులు. అందుకే నరిసింగుకి అంత శ్రద్ధ కొడుకు చదువు మీద,

సూరీడు స్కూలు కెళ్తున్నాడు. వస్తున్నాడు. కానీ బడంటే మొగసాటేసేసింది.

అంతేకాదు!

జాయినయి రెండు సంవత్సరాలు దాటినా వాడికి 'యారవాలు' దాటి రాలేదు 'రొండెక్కాలు' కంఠోపాటం రాలేదు. నాలుగంకెలు కలవటం రాదు. ఈ బడి నుండి ' ఎంకటేశ్వరా' కాన్మెంటునో కెల్లిన ఆడి సేయితులు ఎంకటేసూ, మల్లేసూ, పద్మా ఇంగ్లీషు పుస్తకాలు సదివేస్తన్నారు. ఆల్లమ్మని 'మమ్మీ, డాడీ'లని పిలుత్తారు. ఆల్లు టక్‌లు చేస్తారు. టైలెడతారు. బూట్లేసుకుంతారు. ' ఇక్కడ య్యేవీ ఉండవు!'

ఓసారి బళ్ళో ఎడ్డు మేస్టారికీ ఆనందరావు మీస్టారికీ పెద్ద జట్టే అయింది. ఆనందరావు మేస్టారు ఆ బళ్లో అందరికీ ఎంతో ఇష్టం. అతను వచ్చిందగ్గర్నించీ బోర్డుమీద రాయడం సదివించటం తప్పితే పిల్లలకి పనే చెప్పరు.

సూర్రావు టీచరు ఓ గుంటల్లో టీకి పంపమన్నారు. ఏ పనిచెప్పినా అయిదో తరగతి, నాలుగోతరగతి కుర్రాల్లకే చెప్పారు. ఆల్లయితే బాగా చేస్తారని.

ఆనందరావు మేస్టారు పిల్లణ్ణో పంపనన్నారు లెక్కలు చెపుతున్నానని దాంతో సూర్రావు మేస్టారూ, ఆనందరావు మేస్టారూ గొడవపడ్డారు. ఎడ్మాస్టరొచ్చి ఓ కుర్రాణ్ణి పిలిచి టీ తెమ్మన్నారు ఆ కుర్రాడు టీ తెస్తూ- రాయితన్నీసి పడిపోయాడు. టీ వొలగిపోయింది. దాంతో స్కూల్లో పెద్ద గొడవే అయింది. ఆ కుర్రాణ్ణి ఎడ్మాష్టరు తెగ బాదేసారు.

ఊర్లో అందరికీ ఈ విషయం తెలిసి- కాస్త పైస లున్నవాళ్లు తమ పిల్లల్ని 'వెంకటేశ్వరా' కాన్మెంటులో జాయిన్ చేసేసుకున్నారు. అక్కణ్ణుంచీ 'సూరీడి'కి ఆ బడంటే రోత పుట్టింది.

ఆనందరావు మేస్టారు కొన్నాళ్ళు స్కూలు మారాలేదు.

ఆ తరువాత ఇంకో ఇస్కూలుకి బదిలీమీద 'ఎల్లిపోయా'రని తెలిసి సూరీడు తండ్రితో చెప్పాడు. ' ఎంకటేశ్వరా కాన్మెంటు'లో జాయిన్ చేసేమని.

''ఓరి నీనేటి జమిందారుననుకున్నావా? ఊరికి పెసిరెంటు ననుకున్నావా? సదివితే సదువు. నేపోతే మునిసీబు గారింట్లో పేడలెత్తనానికెవులూ నేరట. పనిక్కుదిరించేస్తాను. సంత్సరానికి పుట్టెడు దాన్నెమూ, పుట్టిడు సోల్లు ఇత్తారు'' అన్నాడు కోపంగా

పారమ్మ గయ్‌మంది.

''ఇద్గో! ఈపారిటికన్నావు. సరిపోనాది. మరో పాలలగనకు సాలు. ఈ సాకిరీలు ఈసావులూను''

''ఒలే, అందలపుట్టిందంటాకా? గంటాకే? ఆడే టికలెక్టరయిపోతాడా? ఎస్సియ్యయిపోతాడా?''

''నీ నాగ సెవట్లోడ్చి, కట్టబడిందంతా కల్లుకీ, సారాకీ ఇవ్వకూడదని తెలుసుకుని...నాలుగు రాల్లు సంపాదిస్తే సాలు!''

ఏ కళనున్నారో గానీ- నరసింగు కాలుకాలిన పిల్లిలా తచ్చాడి, నీటిపాములా జారుకున్నాడు.

'ఏ యుద్ధం జరిగిపోద్దో?' అని భయపడ్డ సూరీడు పలకా బలపం పట్టుకుని ప్రయివేటు కెళ్ళిపోయాడు.

అక్కడా అంతే!

ఆ మేట్రూ వొచ్చినోల్లకే సెప్తాడు.

ఎప్పడయినా ' ఏరా సూరిగా, రాసావా?' అని కసరగానే- సూరిగాడు పక్కనున్న వాడిది చూసి రాసి చూపెడతాడు. తల్లి జీతం ఇచ్చినపుడు మాత్రం 'సూరీడు ఇప్పుడు బాగా చదూతున్నాడు' అనగానే తల్లి ముఖం కొత్త చాటంత కళకళలాడిపోతుంది.

సూరీడు నచ్చని మరో విషయం ఏమంటే-

మొదట్లో ఇచ్చిన బియ్యం మానేసి మధ్యాహ్నం భోజనాలు స్కూల్లోనే పెట్టడం మొదలెట్టారు.

తల్లి సంబరపడిపోయింది.

మొదట్లో సూరీడు సంబర పడిపోయాడు.

అందరూ కంచాలు పట్టుకుని లైన్లో నిలబడ్డం మేస్టార్లంతా పిల్లల్ని లైన్లో పెట్టడం భలే సరదాగా అనిపించేది.

స్కూలు ఎనిమిదిన్నరయినా – పిల్లలందరూ వచ్చేసరికి తొమ్మిదయిపోతుంది. ఎడ్డుమేస్టరూ, తక్కిన మేస్టర్లూ పిల్లల్ని వొరసల్లో నిలబెట్టేసరికి అరగంటయ్యింది. 'సుక్లాంబరదరం', 'మా తెలుగు తల్లికీ' చెప్పి లైన్లో పంపేసరికి మరో అరగంటయిది.

గదిలోకెల్లీ మేస్టార్లొచ్చేసరికి పావుగంటయిాది మేస్టారు ఏదో చెప్తే పిల్లలూ ఎనకాలరిచీవోరు మేకల్నాగా! మేస్టారికి నోరు పీకెడితే బోర్డుమీద ఏదో రాసేసి, దువ్వారం కాడ నిలబడి టీచరమ్మతో కబుర్లు సెప్పేవోరు.

ఈలోగా ఇంట్రబెల్లు.

అందరూ సెలగలూ, సెక్కిలాలు కొనుక్కోని అయితింటూ కూకుంటే మేస్టేరొచ్చి 'ఠట్! ఠట్!' అనివోరు. అంతేనీ మేస్టారయితే కుర్చీలో కూకుని కునికిస్తారు. పిల్లల గోలెక్కువైకేవొస్తే అందరి 'బీపీలూ' (వీపు) తొక్కలెకినట్టు ఎదురుబద్దతో కొట్టేత్తారు.

అందు నుంచీ సూరీడెప్పుడు ఎనకాల కూచునేవాడు.

మరో గంటకి వణ్ణం (అన్నం) పెట్టేస్తారు.

'ఏడి బువ్వ సాంబారీ, వంకాయకూర' ఆ తరువాత కోడిగుడ్డు ఎట్టేవోరు అప్పుడప్పుడు.

ఎంతెట్టినా-

సూరీడికా 'బువ్వ' నచ్చేదికాదు.

దానిక్కారణం ఉంది.

''రత్తాలూ! నువ్వేం బువ్వతినవూ?'' అనడగితే-

''అది ఇంటప్లో కూడులేనోల్లే తింతారు. మా ఇంట్లో టేబిలు మీద తింటాం. ఇక్కడయితే ముస్టోల్లలాగా- కంచాలట్టుకుని నిలబడాల. ఆ ఉచ్చులూ. ఊతులూ ఆటిమద్దిల తినాల. మా ఇంటి దగ్గరయితే మాయమ్మ ఎంత సక్కా తినిపిస్తాది?'' అంది.

## రచయిత పరిచయం



చదువు: భాషా ప్రవీణ, ఎం.ఏ (తెలుగు). వృత్తి: ప్రథమ శ్రేణి తెలుగు భాషోపాధ్యాయుడు. ప్రవృత్తి: కథలు, నవలలు రాయడం. వెలుగుబాట, సంకెళ్ళు, ప్రేమ సూత్రం, జేబులో బొమ్మ, మరో యజ్ఞం వంటి 300 కథలు ఆంధ్రపత్రిక, చతుర, స్వాతి పత్రికలలో ప్రచురితమయ్యాయి. పలు నవలలు ప్రచురణకు నోచుకుని పాఠకాదరణ పొందాయి. నా కథను సాధారణ ప్రచురణకు ఎంపికచేసిన సి.పి.బ్రౌన్ అకాడమీ-నవ్య వీక్లీ సంపాదకవర్గానికి కృతజ్ఞతలు.

-పి.వి.బి.శ్రీరామమూర్తి

సూరీడు మనసు 'సివుక్కు'మంది.

కాలిలో తుమ్మ ముల్లు గుచ్చుకున్నంత నుల్చుకున్నాడు. 'బుబ్బ వేడిగా ఉంటాది. సాంబారే బాగుంటాది. అప్పుడప్పుడు 'వొణ్ణం' ఉడకదు కానీ ఒక్కోపాలి కూరలో ఏటి సాలదో, తినబుద్ధి కాదు. కొంతమంది కంచంలో బువ్వపెడతారు గానీ- ఒక్క పిసరైనా తినకుండానే పెంటమీద పోస్తారు. ఆటికోసం కుక్కలు కొట్లాడుకుంటాయి. కాకులు తన్నుకుంటాయి. ఈగలూ, దామలూ జుమ్మని వాల్తాయి. ఒక్కోసారి కూకుని వణ్ణం తింటుంటే కంచాన్ని కుక్కలు నాక్కుపోతాయి. ఇదొవులూ పట్టించుకోరు.

కాకులు తన్నడం వల్ల ఒక్క సుట్టు సేతల కంచం తిరగబడిపోయింది బువ్వంతా బుగ్గయిపోయినాది ఎంకటేసు ఎడ్డుమేస్త్రుకి సెపితే 'ఎదవ న్నర ఎదవా! బుర్ర తిరుగుతుందా? పోత్రమా? ఆ గవర్నిమెంటుకు బుద్ధి లేదు మాకు గతినేదూ? ఏ జనమలో ఏ పాపం సేసినామో ఈ జలమలో మీ గోల్లు కత్తిరించమని మీ మూతులు కడగమని కూడా సెప్తార్రా! అని అంతోనీ మేస్త్రు మధ్యలో వొచ్చి బాదేసినపుడు సూరీడికి సచ్చిపోవాల నింపించింది!

కానీ-

ఇంటికాడ తల్లేయిపోద్దో?

'ఎంకటేశ్వరా కాన్మెంటు' పెట్టే రెండో, మూడో సంవత్సరాలయింది. ఆ కాన్మెంటులో డేన్సులు చేసినారు. పాటలు పాడినారు. నాటకాలేసినారు. ఇక్కడన్నంచెల్లిపోయినోల్లందరికీ అక్కడ బవుమా నాలొచ్చినాయి.

ఇక్కడోలు అలపింటెవేవీ ఉండవు

ఆ మద్దిలయితే-

పదేన్రోజులు అంతోని మేస్త్రు, ఎడ్డు మేస్త్రే మిగిల్నారు. ఏవో ఇంటింటికీ తిరిగి నెక్కలెయ్యాలట. ఒక్క బువ్వకే ఇస్కులు కెల్లటమే!

ఎల్లిన కానిండి ఎవులుకు తోసినట్టు ఆల్లాడుకోడమే

ఆ తరువాత ఎలవసన్లొచ్చినాయి!

మేస్టర్లందరూ ఎల్లిపోను. ఇస్కూలు బడిలో ఓట్లేసినారు. బడికి సెలవలిచ్చేసినారు.

ఆ రోజుల్లో.-

తల్లి సుబ్బరంగా బువ్వపెడితే కడుపునిండా తినేవోడు. తల్లి ఊరిపిండొడెమో, అప్పడమో, పకోడీలో నంబుకిచ్చేది అయినా ఎంత రుసో, అమ్మ సేతి తిండి?

మల్లీ ఇస్కూలు

పరిచ్చలు. మేట్లర్లే బోర్డుమీద రాసేసివోరు. నూటికి డెబ్బయి, ఎనబయ్యి మార్కులు. అమ్మ పొంగిపోయేది.

ఒక పాలి-

కరణం గారింటికెల్తే '' ఏటి చదవుతున్నావు రా?'' అని అడిగాడు ఆయన. చెప్పాడు సూరీడు. ''మావోడికి డెబ్బయిలు, ఎనభైలూ వత్తన్నాయండీ!'' అని తల్లి చెప్తే 'సిగ్గుతో తల్లి కొంగు చాటు కెళ్ళిపోయాడు సూరీడు '' ఓలమ్మా సెప్పకే'' అని గొణుకుతూ.

''ఏంటంటున్నాడే?''

''ఆడికి సిగ్గండీ, ఆడిమార్కులు సెప్పందంటాడు''

''ఏరా? ఆరయిదులెంతరా?''

చెప్పలేదు. చెమటెక్కిపోయాడు.

తల్లి బతిమాలింది. అయినా చెప్లేదు.

ఈలోగా-

మూడేళ్ళ కరణంగారి మనవడొచ్చి గడగడా అన్నెక్కాలూ చెప్పేసాడు.

– దాంతో తలతీసినంత పనయింది సూరీడుకి.

తల్లికీ, తండ్రికీ ఒకటే తెల్సు

కొడుకు స్కూలు కెల్తున్నాడు. వాళ్ళు చక్కగా తిండిపెడుతున్నారు. కానీ ఆ తిండి 'ముష్టితిండి' అని ఆ తిండి తినని కొంతమంది ఈసడించడం, ఆ బడినుంచి వెళ్ళిపోయి 'ఎంకటేస్వరా కాన్మెంట్లో' చేరిన వాళ్ళంతా ఎంతో ముస్తాబయి- టక్కుటిక్కుమంటూ వెళ్ళిరావటం – ఎన్నో పద్యాలూ, రైమ్సూ చెప్తుండటం ఇవి చూస్తున్న సూరీడుకు తన బడో దెయ్యాలకొంపలాగా- ఆ తిండి విషం లాగా అని పిస్తోందెప్పట్నుంచో!

ఆ విషయం తండ్రికి చెప్పాలంటే ధైర్యం చాలదు. తల్లి ఒక్కతే ఉంది ఇప్పుడు చెప్పెయ్యాలి.

★



## ఆశిన్ డిమాండ్

ఆశిన్ ఏది ఎక్కడా కనిపించట్లేదంటారా? ఇక మీకెందుకు కనిపిస్తుంది! ప్రస్తుతం బాలీవుడ్‌లో దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే ప్రయత్నంలో బిజీగా వుంది. హిందీ 'గజనీ'లో నటిస్తుందిగా. ఈ సారి 'హృదయం ఎక్కడున్నది...' అంటూ ఈమె చుట్టూ చక్కర్లు కొట్టే బాధ్యత అమీర్‌ఖాన్ తీసుకున్నాడు. తెలుగు 'గజనీ' చూసిన తర్వాత హీరోయిన్ స్థానంలో ఈమెను తప్ప వేరొకర్ని ఊహించుకోలేక పోయాడట ఖాన్‌సాబ్. అక్కడితో ఊరుకోక ప్రతీ ఇంటర్వ్యూలోనూ ఆమె అద్భుతం, ఆమె నటన అద్భుతం' అని ఎడా పెడా పొగిడేస్తుండటంతో బాలీవుడ్ ప్రొడ్యూసర్లందరూ ఈమె చుట్టూ క్యూలు కట్టేస్తున్నారు. బాలీవుడ్ పల్లకీ ఎక్కిన ఈ చక్కనమ్మకు మరిక టాలీవుడ్ ఎందుకు గుర్తొస్తుంది.